# నిరీక్షణ

జి. నరసింహమూర్తి

ఆకాశమంతా నల్లని మబ్బులచే కప్పబడి వర్షం కురవడానికి సిద్ధంగా వుంది. కారుచీకటి బయట నృత్యం చేస్తోంది. మధ్య, మధ్య మెరుపులు మెరుస్తున్నాయి.

చల్లని గాలి వీయడంవలన వర్షపుజల్లు ప్రారంభమైంది నెమ్మదిగా.

కిటికీ ప్రక్కనే కూర్చొని తాను వ్రాసిన ఉత్తరం మరోసారి చదువుకుంది 'లలితాదేవి'. పూర్తి అవగానే టేబిల్‌పై పెట్టి, ఎగిరిపోకుండా పైన పుస్తకం పెట్టింది.

రాబోతున్న కన్నీటిని ఆపుకుంటూ ఆ నిశీధి లోనికి పిచ్చిగా చూస్తూ వుండిపోయింది

బయట వర్షం ఉధృతముగా కురుస్తోంది... అక్కడక్కడ పిడుగులు పడుతున్న చప్పుడు.

మూగవోయిన గొంతుకతో తానులో తాను అనుకుంటోంది. భగవంతుడా ఎందుకు నాపై ఈ కక్ష. నేనేం నీకపకారం చేసాను. ఇన్నాళ్లు ఈ నిరీక్షణ ఎవరి కొరకు ?

మేఘాలు గాలికి పరుగెడుతున్నాయి.

ఆమె ఆలోచనలు గతంలోనికి జారేయి.

* * *

...హాలులో మనవడితో కబుర్లాడుతున్న 'లలితాదేవి' గేట్ దగ్గర కారు ఆగిన చప్పుడవడంతో తల ఎత్తి చూసింది.

కారు దిగి చిన్నకొడుకు డాక్టర్ 'చక్రధర్' తూలుతూ వస్తున్నాడు. లలితాదేవి భయంగా లేచి కొడుక్కి ఎదురువెళ్ళి "చక్రీ" అంది.

"అమ్మా" అన్నాడు గుమ్మం పట్టుకుంటూ.

"ఏమైందిరా ! అలా వున్నావేం ?" అంది కంగారుగా, అతని చెయ్యి పుచ్చుకొని సోఫాలో కూర్చోబెట్టింది.

"ఏమి కాలేదమ్మా · అనుకోకుండా మరో వ్యక్తికి నా రక్తం ఇవ్వవలసి వచ్చింది. కొద్ది నీరసంగా వుండటంచే అడుగులు తడబడ్డాయి. కాస్త కాఫీ తీసుకొని రామ్మా"...

మనవడ్ని తోటలోకిపోయి ఆడుకోమని చెప్పి, తాను లోపలకు వెళ్ళి కాఫీతెచ్చి అతని చేతికిచ్చింది.

చక్రధర్ అది త్రాగి సరిగా కూర్చొన్నాడు. లలితాదేవి అతనిప్రక్కనే కూర్చొని ప్రేమగా అతని తల నిమురుతూ.

"ఏమి జరిగింది చక్రీ" అంది ఆప్యాయం ధ్వనించే కంఠంతో.

"ఏమీ లేదమ్మా ! సాయంత్రం హాస్పటల్ నుండి నా డ్యూటీ అయిపోగానే వచ్చివేదామనే ప్రయత్నంలో వున్నాను ఇంతలో నలుగురు పోలీసులు స్పృహ తప్పిన ఒక వ్యక్తిని తీసుకొని వచ్చి హాస్పటల్‌లో జాయిన్ చేసారు. వెంటనే అతనికి ఆపరేషన్ చేసి కాలిలో దిగిన తుపాకిగుండును తీయవలసివచ్చింది... ఇద్దరి నర్సుల సహాయంతో అతనికి ఆపరేషన్ చేయగలిగేను కాని...అని ఆగిపోయేడు.

"ఆగిపోయావేం చెప్పబాబు"

"ఆ వ్యక్తిని ఎక్కడో చూసినట్లు ఎన్నో జన్మల అనుబంధం వున్నట్లు అనిపించిందమ్మా! అతన్ని చూడగానే నాలో ఏదో తెలియని ఆత్మీయత కలిగింది.',

"అదేమిట్రా కొందర్ని చూడగానే అలాగే అనిపిస్తూవుంటుంది దానికే అంత బాధ పడాలా?"

'లేదమ్మా! ఎందర్ని చూడటంలెదు అందర్ని చూస్తుంటే అలాంటి అనుభూతి కలుగుతుందా? ఇంకా విచిత్రమేమిటంటే అతనికి ఆపరేషన్ చేసినతరువాత కొద్ది రక్తం ఎక్కించవలసివచ్చింది. అతనికి సరిపడే రక్తం సమయానికి హాస్పటల్‌లో లేకపోయింది. ఆలోచించడానికి కూడా వ్యవధి లేకపోయింది. వెంటనే నా రక్తం పరీక్షచేస్తే అతని రక్తానికి సరిగ్గా సరిపోయింది. సిస్టర్స్ సహాయంతో నా రక్తం తీసి అతనికి ఎక్కించేను." అని ఆగిపోయేడు.

ఆశ్చర్యంగా "చక్రి" అంది.

"అవునమ్మా...ప్రక్కన వున్న స్టాఫ్ చాలా ఆశ్చర్యపోయేరు. 'ఏమిటి డాక్టర్, ఒక నేరస్తునికి మీ రక్తం ఇవ్వడం బాగుండలేదు' అని వాదించేరు. అప్పుడు నేను ఏమి అనలేకపోయేను. చివరికి డాక్టర్‌గా నా ధర్మం నిర్వహించేను" అన్నాను అంతే అందరు నా వంక వింతగానే చూసేరు... దయచేసి నన్ను కాసేపు విశ్రాంతి తీసుకోనివ్వండి... మీరంతా బయటకు వెళ్ళండి'' అని అన్నాను. వారంతా బయటకు వెళ్ళిపోయారు.

అతనివంక చూస్తూ అలాగే కొన్ని క్షణాలు అలాగే గడిపివేసాను. అతనిని వదలి రాలేకపోయేను. అరగంట గడిచిన తరువాత అతనికి స్పృహ వచ్చి మెల్లిగా కళ్లు తెరిచేడు. ఎదురుగా వున్న నన్నుచూసి

"డాక్టర్" అని నెమ్మదిగా పిలిచేడు.

"ఏమి కావాలి?'' అన్నాను దగ్గరకు వెళ్ళి.

"నేను చచ్చిపోలేదా?" అన్నాడు నీరసంగా.

''దేనికి?" చచ్చిపోవడం అంటే నీ కిష్టమా?

అతను విచిత్రంగా నవ్వేడు.

"డాక్టర్! జీవితానికి ఒక అర్థం అంటూ ఏమి లేనప్పుడు అదే మంచిది. అందరు చావుకు భయపడి దూరంగా పారిపోతారు. కాని నేనుమాత్రం దానిని ఆనందంతో ఆహ్వానిస్తున్నాను. చచ్చిపోతానని నాకు భయంలేదు డాక్టర్! చచ్చిపోయేలోపల నాకు వున్న కోరిక ఒక్కటే" అని ఆగేడు.

''ఏమిటది'' అన్నాను ఆతృతగా.

అతను నాకు సమాధానం ఇవ్వకుండా శూన్యంలోకి చూస్తున్నాడు. అతని హృదయంలో అశాంతి చెలరేగుతున్నట్లు అనిపించింది...

''అసలు మీరు ఎందుకు నన్ను బ్రతికించేరు డాక్టర్?'' అన్నాడు నా వైపు తిరిగి.

నేను ఆశ్చర్యంగా అతనివంక చూసేను... నవ్వుతూ అన్నాను ''నేనుడాక్టర్ని...అది నా ధర్మం''

''చాలా పొరబాటుపని చేసేరు డాక్టర్...ఇందాకే ఆపరేషన్ చేసేటప్పుడు, మీరు నాకు ఇంత విషం ఇచ్చివుండవలసింది...మీకు నా నిజస్వరూపం తెలిస్తే మీరు బ్రతికించేవారే కాదు'' అని ఆగిపోయేడు.

నేను అతని విషయంలో చాలా వింతగా ఆలోచిస్తున్నాను.

''డాక్టర్! ఎంతో శ్రమ తీసుకొని నన్ను మీరు బ్రతికించినా! నాలుగైదు రోజులలో నాకెలాగు ఉరిశిక్ష తప్పదు" అన్నాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి అతనికి.

"ఉరిశిక్షా!" అన్నాను ఆశ్చర్యంతో.

"అవును డాక్టర్! ఈ పాపికి అంతకన్నా పెద్ద శిక్ష ఏముంది? అందుకే చనిపోయేలోపల ఒకసారి నా హృదయదేవతను చూసి చనిపోవాలనిపించింది...

ఆ కోరిక తీర్చుకుందామని ప్రాణాలు సైతం తెగించి జైలులో నుండి పారిపోయి వస్తుండగా, అడ్డువచ్చిన ఒక పోలీసు ప్రాణాలసైతం తీయడానికి వెనుకాడ లేదు... నన్ను వెంటాడుతూ నాపై వాళ్ళు కాల్పులు జరిపేరు... ఒక గుండువచ్చి కాలికి తగలడం వలన అక్కడే కూలిపోయాను స్పృహను కోల్పోయిన నేను కళ్ళు తెరిచేసరికి ఇక్కడ వున్నాను" అని ఆగేడు ఊపిరి పీల్చుకుంటూ

అతను చెప్పేదంతా వింటూవుంటే నాలో ఏదో తెలియని ఆవేశం కలిగింది.. జీవితంలో అన్నీ కోల్పోయిన అభాగ్యుడులా నాకు కనిపించేడు. కాని అతన్ని అలాగే చూస్తుంటే, నాలో ఏదో ఒక శక్తి అతనికి ఇంకా సహాయం చేసేటట్లు కలిగింది

అందుకే "నీ పేరు ఏమిటి?" అని ప్రశ్నించేను.

అతను విషాదంగా నవ్వేడు.

"ఈ అభాగ్యుడికి ఒక పేరంటూ లేదు డాక్టర్! నా గత చరిత్ర అంతా చుక్కానిలేని నావలాంటిది... ఈ చివరి సమయంలోనైనా ఒక ఆత్మీయునితో మనసారా మాట్లాడుకున్నాననే ఒక అనుభూతి మాత్రం మర్చిపోలేను. ఇకనేను చనిపోయినా ఫర్వా లేదు" అన్నాడు చేతులెత్తి నమస్కారం పెడుతూ.

"వద్దు నీవు పెద్దవాడివి నాకు నమస్కారం చేయకూడదు... ఇక నీవు రెస్టు తీసుకో...రేపువచ్చి చూస్తాను" అంటూ బయటకు వచ్చివేసాను.

విధి చాలా విచిత్రమైనది. అతనెవ్వరు? నేనెవర్ని. తెలియకుండానే ఒక నేరస్థునికి రక్తదానం చేసాను... అది ఎంతవరకు ఫలితాన్ని ఇస్తుంది?... ఆ ప్రశ్న నాలో కలిగినా...ఒక అనుబంధం అనే తెర దానిని కప్పివేస్తోంది"...

అతని ప్రాణాలు నేను నిలబెట్టినా, రేపు న్యాయ స్థానం అతనిని 'ఉరి' తీస్తుంది అనే భావం నాలో కలిగేసరికి, నేను భరించలేకపోతున్నానమ్మా...భగవంతుని లీలలు ఎంత విచిత్రంగా వుంటాయి అని అనిపిస్తోంది"...

చక్రధర్ చెప్పడం ఆపేడు.

ఇదంతా వింటున్న 'లలితాదేవి' మదిలో ఊహ కందని భావాలు ఏవో ఏర్పడుతున్నాయి...

అప్పటికే ఆ గదిలో చీకటి ఛాయలు అలుము కున్నాయి.

లలితాదేవి లేచి లైట్ వెలిగిస్తూ... "జరిగింది మర్చిపో చక్రీ! బాధపడకు. భగవంతుడు ఆడించే టట్లు మనం ఆడవలసిందేగాని, మనం ఏమీ చేయలేం... డాక్టర్‌గా నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించావు అంతవరకే నీ పాత్ర... తరువాత నీ చేతుల్లో ఏముంది?... లే! లేచి బట్టలు మార్చుకొని రా! భోజనం చేద్దువుగాని" అంటూ లోపలకు వెళ్ళిపోయింది.

○ ○ ○

కాలగర్భంలో పదిరోజులు కలసిపోయాయి...

సప్తమినాటి చంద్రుడు ఆకాశంలో మసకగానే కనిపిస్తున్నాడు. నక్షత్రాలు వెల వెల బోతున్నాయి...

వంటింట్లోనుండి 'లలితాదేవి' పెద్దకోడల్ని 'నీరజా! నీరజా!' అని పిలిచింది.

"ఏమిటండీ అత్తయ్యా"

"పెద్దబాబును భోజనానికి రమ్మను ఇప్పటికే చాలా సేపు అయ్యింది"

"ఇప్పుడు రారుట త్తయ్యా! వారు చాలా చిరాకు పడుతున్నారు... నేను పిలిస్తే కసురుకుంటున్నారు కూడా, మీరే వెళ్ళి పిలవండి" అంది.

"సరే! నేను వెళ్ళి పిలుస్తాగాని నీవు డైనింగ్ టేబిల్‌పై అన్నీ సిద్ధంచేయి" అని మేడపైకివెళ్ళింది.

మెజిస్ట్రేట్ 'రజనీకాంత్' సోఫాలో కూర్చొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. 'లలితాదేవి' అతనిని పరిశీలించిచూసి, ఏదోబాధపడుతున్నట్లుగ్రహించింది.

"కాంతీ!" అంది అతని దగ్గరకు వెళ్ళి.

"రా అమ్మా! ఇంకా నీవు నిద్రపోలేదా!" అన్నాడు సోఫాలో తల్లికి చోటు ఇస్తూ.

"అలా వున్నావేం బాబూ! ఒంట్లో బావుండ లేదా?" అంది.

"బాగానే వున్నానమ్మా! కాని మనస్సు ఏమి బాగుండలేదు."

"అదేం ఏమి జరిగింది?"

"ఈవేళ ఒక అతనికి ఉరిశిక్ష విధించవలసి వచ్చిందమ్మా అసలు ఈ ఉద్యోగం చేయకపోయినా బాగుండేది అని అనిపిస్తూ వుంటుంది అన్నాడు లేచి కిటికీ వద్దకు వెళ్ళి బయటకు చూస్తూ।

"అదేమిట్రా న్యాయాన్ని రక్షించడంలో నీ తప్పు ఏముంది? ఎందుకు నీలో నీవు అలా బాధపడతావు? తప్పు చేసిన దానిని బట్టే కదా నీవు శిక్ష విధించేది. నీవు న్యాయమూర్తివి; దీనిలో నీవు బాధపడవలసిన వనేముంది?"

"అది కాదమ్మా; ఈవేళ నేను ఉరిశిక్ష విధించి నతను ఎవరో కాదు... పదిరోజుల క్రితం తమ్ముడు తన రక్తాన్నిచ్చి ప్రాణదానంచేసిన వ్యక్తి...అతనికే నేను శిక్ష విధించవలసి వచ్చింది" అన్నాడు తల్లి వైపు తిరిగి.

"అతనేనా" అంది ఆతృతగా.

"అవునమ్మా! వయస్సులో చాలా పెద్దవాడిలా వున్నాడు యౌవనంలో చేసిన తప్పులకు ఈనాడు అతనిని ఉరికంబానికి ఎక్కించవలసి వచ్చింది... అతని చరిత్ర వింటే ఎవ్వరికైనా జుగుప్సను కలిగి స్తుంది...అతనొక దగాకోరు, వంచకుడు, హంతకుడు కూడా! అమ్మా! ఎందరో అమాయకమైన ఆడవాళ్ళ జీవితాలు పాడుచేసిన పాపి... వాళ్ళ జీవితాలతో చెలగాటాలాడి, వాళ్ళను వంచించిన దుర్మార్గుడు... అతని మార్గానికి అడ్డువచ్చినవాళ్ళను హతమార్చేడు. ఇన్నాళ్ళు చట్టానికి దొరకక తప్పించుకొని తిరిగేడు.

ఈనాడు అతను చెప్పేది వింటూవుంటే చాలా విచిత్రంగా వుంటుంది. ఎప్పుడో నలభై సంవత్స రాలు క్రితం విడిచిపెట్టబడిన తన భార్యాబిడ్డలను చూడటానికి జైలులోంచి పారిపోతున్నాడట. అతన్ని పట్టుకోవడానికి అడ్డువచ్చిన పోలీసును కూడా చంపి పారిపోవడానికి ప్రయత్నించేడు. చివరికి విధి చేతికి లొంగిపోవలసి వచ్చింది.

ఆతృతను అణుచుకోలేక "అతని పేరేమిటి బాబు" అని అడిగింది.

"అతని కొకపేరు అని ఏముందమ్మా!... ఊరు కొకపేరు చొప్పున పెట్టుకునేవాడు... కాని అతని అసలి పేరు "రాజశేఖరం".

"బాబూ" ఎక్కడో పిడుగుపడినట్లైంది.

రజనీకాంతు తల్లివంక ఆశ్చర్యంగా చూసేడు. ఆమె స్పృహ తప్పినట్లు కనబడింది. దగ్గరకు వచ్చి "అమ్మా! అమ్మా!" అని పిలచేడు ఆమెను పట్టుకుంటూ!

అప్పటికి 'లలితాదేవి' స్పృహను కోల్పోయింది.

రజనీకాంత్ 'నీరజా' అని గట్టిగా కేకవేసాడు.

'వస్తున్నా' అంటూ త్వరగా మేడ పైకి వచ్చింది నీరజ.

'తమ్ముడు వున్నాడా క్రింద'

'వున్నారు. ఎవ్వరితోనో మాట్లాడుతున్నాడు.'

'త్వరగా వెళ్ళి పిలుచుకొని రా'

నీరజ క్రిందకు వెళ్ళి చక్రధర్‌ను పిలుచుకొని వచ్చింద.

చక్రధర్ ఆ స్థితిలో వున్న తల్లిని చూసి 'ఏమైంది'? అన్నాడు ఆతృతగా.

'ఏమికాలేదు. స్పృహ తప్పి పడిపోయింది' అన్నాడు రజనీకాంత్.

చక్రధర్ వెంటనే ఇంజక్షన్ తెచ్చి తల్లికి చేసి స్పృహ వచ్చేటట్లు చేయగలిగాడు.

కొద్దిసేపైన తరువాత ఆమె లేచి కూర్చుంది.

"అమ్మా! ఏమి జరిగింది?" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"ఏమి కాలేదు బాబు కాస్త కళ్ళు తిరిగాయంతే! రండి భోజనం చేద్దాం, రా నీరజా!" అంటూ క్రిందకు వెళ్ళిపోయింది.

అన్నదమ్ము లిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఆమె హృదయంలో పగిలిన అగ్ని పర్వతం వాళ్ళు తెలుసుకోలేక పోయారు.

o o o

వర్షం విరామం లేకుండా కురుస్తోంది. చలిగాలి హోరున వీస్తోంది.

వీధి తలుపు గాలికి కొట్టుకోవడంతో 'చక్రధర్'కు మెలుకువ వచ్చింది. టైం చూసేడు. రాత్రి రెండు అయింది. ఇంకా తల్లి గదిలో నుండి దీపం వెలుగుతూ వుండటం అతనికి ఆశ్చర్యం గొలిపింది. అమ్మ యింకా నిద్రపోలేదా అనుకుంటూ ఆమె గది దగ్గరకు వెళ్ళాడు.

"అమ్మా!...అమ్మా!' అని పిలిచేడు.

సమాధానం లేక పోవడంతో అతనికి ఆతృత హెచ్చు అయినది. టేబిల్ పైనున్న కాగితాలు గాలికి కదులుతూ అతని దృష్టిలో పడ్డాయి. అవి తీసుకొని చదువుతుండగానే అతని మొహంలో రంగులు మార జొచ్చాయి. వేగంగా గుండె కొట్టుకుంటూంది. పూర్తి అవగానే.

'అన్నయ్యా' అంటూ ఒక్క గావుకేక పెట్టి మేడ పైకి పరుగెత్తుకొని వెళ్ళాడు.

రజనీకాంత్ ఈ కేక విని ఉలిక్కిపడి త్వరగా బయటకు వచ్చాడు. వణికిపోతున్న తమ్ముడ్ని చూసి.

"ఏమైందిరా! అలా కంగారు పడతావేం"?

"అమ్మ...అన్నయ్యా...అమ్మ" అపైై చెప్పలేక తన చేతిలో వున్న కాగితాలు అతనికిచ్చాడు.

కళ్ళజోడు పెట్టకొని చదువుతున్నాడు రజనీకాంత్. అతని కళ్ళముందు అతని తల్లి విగ్రహం కనబడింది.

"ప్రియమైన కాంతీ!

మానవ జీవితం అశాశ్వతం అవడం వలన యే నాడో ఒకనాడు అది మట్టిలో కలియక మానదు. అందుచేతనే ఈ మమతలు, అనుబంధాలు ప్రేమానురాగాలు జీవించినంత వరకే వుంటాయేమో.

నేను నడచిపెళ్ళే బాట పూర్తి అయిపోయింది బాబు ఆ తరువాత నాకు పెద్ద అగాధమే కనిపించింది...అందుకే మీకు నేను అందని లోకాలకు వెళ్ళిపోతున్నాను.

ఆశించినది అందుకోలేనప్పుడు యీ జీవితానికి అర్థము ఏమిటి అనిపిస్తుంది?

నలుబది సంవత్సరాలు నా గుండెల్లో దాచుకున్న అగ్ని పర్వతం యీ నాడు పగిలింది...అదే మీ ముందు వుంచుతున్నాను.

ఇన్నాళ్ళు ఏ వ్యక్తికోసం నిరీక్షిస్తున్నానో, అదే వ్యక్తి దగ్గరకు వచ్చి దూరమైపోయాడు. అందుకే నేను బ్రతికి ప్రయోజనం ఏమిటి అనిపించింది.

భగవంతుని లీలలు ఎవ్వరికీ అర్థం కావు బాబూ!

ఏ వ్యక్తినైతే, చూడగానే మమతలు చెలరేగి, తన హృదయంలో అనురాగపు కెరటాలు కదలి, నీ తమ్ముడు తన రక్తాన్నిచ్చి అతని ప్రాణాలు కాపాడేడో!

ఆదే వ్యక్తి చేసిన తప్పులకు నీవు నీ చేతుల మీదుగా 'ఉరిశిక్ష' విధించి న్యాయానికి బలిచేసావు. ఇంతకన్నా అదృష్టం నాకు ఏం కావాలి బాబూ!

ఇంత జరిగాక కూడా ఆయన ఎవరో మీకు చెప్పకపోతే, మీకు ఎలా తెలుస్తుంది?...కాని చెప్పక తప్పదు...'తన రక్తాన్ని పంచి యిచ్చి, మీకు జన్మ నిచ్చిన మీ తండ్రి ఆయనేరా...' ఆయనే మీ కన్న తండ్రి అని చూపించలేని దౌర్భాగ్యపు జీ వి త ం నాది...

ఇన్నాళ్ళు యీ ఆరని మంటలు నా గుండెల్లో దా చు కు ని మీ ముందు ఎప్పుడు వుంచలేదు... అందుకు కారణం నేను కన్న కలలన్నీ కూలిపోతా యేమోననే నేను భయపడేదాన్ని... ఈ నాటితో నా నిరీక్షణ పూర్తి అయినది...అందుకే ఆయన గురించి విపులంగా వ్రాస్తున్నాను.

—"అవి నేను కా లే జీ లో చదువుకుంటున్న రోజులు".

రాజశేఖరం మన ఇంటి ప్రక్కనే వుంటూ వుండే వాడు. అతనిని ఎప్పుడు చూచినా చిరునవ్వుతో, నలగని తెల్లని బట్టలతో హాయిగా వుండేవాడు... అతను విసిరే చిరునవ్వుల బాణాలు నాకు తగిలి, నేను అతని వలలో చిక్కుకున్నాను.

నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పుడు, నేను అతనినే పెళ్ళి చేసుకుంటానని ఎదిరించాను. కాని నా మాట ఎవ్వరూ వినలేదు. ఫలితం నేను చేతికి దొరికిన డబ్బు తీసుకొని అతనితో ప్రయాణ మయ్యాను. ఆనాడు అతను లేనిదే ఒకక్షణం కూడా జీవించలే నని పించేది ఎవ్వరికీ కనిపించకుండా దూ ర ం గా వెళ్ళి రిజిస్టర్ మ్యారేజి చేసుకున్నాం. అతను ఏదో ప్రైవేట్ ఫరమ్‌లో పనిచేస్తూ వుండే వారు.

ఐదు సంవత్సరాలు నాకు తెలియకుండానే అతని సాంగత్యములో గడచిపోయాయి. అప్పుడే మీ రిద్దరు పుట్టేరు. కాలం ముందుకు సాగేకొలది, మాకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆయనలో చికాకు ఎక్కువైంది...

చివరకు ఒక రోజు...అదే నా జీవితంలో చివరి రోజు ఎమోననిపించింది. ఆయన పనిచేస్తున్న కంపెనీ యజమాని కూతుర్ని తీసుకొని పారిపోయా రని తెలిసింది... ఈ వార్త వింటూనే నేను కూలి పోయాను ...ఆయన అటువంటి వ్యక్తి అని నేను కలలో కూడా అనుకోలేదు. పైకి అంత అందంగా కనిపించే వ్యక్తిలో యిటువంటి విషపుటాలోచనలు వుంటాయని తెలుసుకోలేక పోయాను.

అతను ఆదే చదరంగంలో నేను ఒక పావున్నైనా నని తెలుసుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. నేను బ్రతికి ప్రయోజనం ఏమిటి? అని అనిపించింది.

ఆనాడే నా జీవితాన్ని అంత మొందించుకోవాలను కున్నాను. కాని మా అనురాగానికి ప్రతిరూపములుగా ఉన్న మిమ్మల్ని చూసి, నా ప్రయత్నాలు విరమించు కొని తిరిగి జీవించడం ప్రారంభించాను.

కాంతీ! ఆనాడు నేనెలాంటి కష్టాలు ఎదుర్కొ న్నానో ఆ భగవంతునికే తెలియాలి...

నడుస్తున్న ఎడారిలో నేను ఒంటరిదాన నైనాను. అయినప్పటికీ మిమ్మల్ని చూసుకుంటూ, మీరే నా రెండు కన్నులుగా భావించుకొని బ్రతుకుతున్నాను.

పట్టుదలతో నేను తిరిగి ఇంటికి పో కు ం డా అక్కడే వున్నాను. కాని మా అమ్మ, నాన్న నా విషయం తెలుసుకొని గుండె బాదుకొంటూ 'నా జీవి తం యిలా తయారైనందుకు' ఎంతో విలపించారు. నేను ఒక దాన్నే వారికి సంతానం కావటం వలన కడుపుతీపి వారికి నన్ను దూరంచేయలేక పోయింది. మా నాన్న అక్కడవున్న ఆస్తినంతా అమ్ముకొని ఈ

పట్టణంలో ఇల్లు అది కట్టి, మిమ్మల్ని పెంచి పెద్ద వాళ్ళను చేసారు...

మీరు పెద్దఅయిన తరువాత కూడా మీ నాన్న గురించి మీకు ఏమీ తెలియకుండా మీ తాత కట్టు దిట్టం చేసారు.

నేను కూడా అప్పటినుండి ఆ అగ్నిని గుండెల్లో దాచుకొని జీవిస్తూ వచ్చాను...

కాలగర్భంలో అనేక సంవత్సరాలు గడచి పోతు న్నాయి. అయినప్పటికీ ఆయన ఎప్పుడో కప్పుడు వస్తారని ఆశించి, యింతవరకు నిరీక్షించాను. ఆయన ఎటువంటివారయినా కాని, నా హృదయంలో ఆయనకు ఎప్పుడూ ఒకే పవిత్రమైన స్థానం యిచ్చాను.

నా ఆశయాల కనుగుణంగా మిమ్మల్ని తీర్చి దిద్దుకున్నాను. కాంతీ! నీవు ఆయన గురించి చెబు తున్నప్పుడు, నా గుండె యింకా ఎందుకు పగిలి పోకుండా వుంది అని అనిపించింది...నేను యింకా జీవించి ప్రయోజనం ఏమిటి?

అందుకే మీకు అందని దూరతీరాలకు వెళ్ళి పోతున్నాను.

ఆశీర్వచనములతో

మీ 'అమ్మ'

ఆ వుత్తరం చదవగానే 'రజనీకాంత్' కొన్ని క్షణాలు తేరుకోలేక పోయాడు...అతని కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా

"చక్రీ అంతా అయిపోయిందిరా...అమ్మను గురించి మనం తెలుసుకోలేక పోయాం" అంటూ సోఫాలో కూలిపోయాడు.

బయట వర్షం యింకా ఆగకుండా అలాగే కురు స్తోంది.

---


**కులమత రహిత రాజ్యాంగం మనది. సమసమాజ నిర్మాణమే మన ధ్యేయం**

మన రాజ్యాంగంలో 17వ సూత్రాన్ననుసరించి అస్పృశ్యత రద్దు చేయబడినది దీనికి భిన్నంగా నడిచినవారు శిక్షార్హులు.

రాజ్యాంగం తాలూకు 18 (2) అంశాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం పోషిస్తున్న ఏ విద్యా సంస్థలో నైనానరే ఏ పౌరునికైనా జాతి, కులమత, భాషా ప్రాతిపదికపైగాని దానిలో ఏ ఒక్క దానిపై గాని ప్రవేశాన్ని నిరాకరించటానికి వీలులేదు.

38, 40 అంశాల ననుసరించి దుర్బలులైన హరిజనులు లాభాలను పెంపొందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసికోవడమేగాక సాంఘిక దురన్యాయాలనుండి, అక్రమ వినియోగాలనుండి సంర క్షించడానికి కట్టుదిట్టాలు కల్పించబడ్డాయి.

కాబట్టి మనం వీలైనంత త్వరలో అస్పృశ్యతా కళంకం నుండి విముక్తులం కావాలి. మన శాసనాలనుండి స్మృతి గ్రంథాలనుండి 'పంచమజాతి' 'పరిగణితజాతి' అనే శబ్దాలు రూపు మాసి పోయేలాగా మన సమసమాజ రూపురేఖలు దిద్దుకోటానికి మనమంతా నిర్విరామ కృషి చేద్దాం.

సాంఘిక సంక్షేమ శాఖ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.